ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8, కనిష్ఠం 18.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 7 నవంబరు 2024

గిరిజనుల అభివృద్ధికి కృషి : పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో విద్య, వైద్యం, ఉపాధి యువత మానసిక వికాసం కోసం శ్వషోదన్, ధర్మసేవ సంస్థలతో కలిసి ముందుకు వెళతామని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బుగుప్తా పేర్కొన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ పీవో చాంబర్‌లో హైదరాబాద్‌లోని శ్వషోదన్, ధర్మసేవ సంస్థల ప్రతినిధులు డాక్టర్ పూలపల్లి కరుణాకర్‌రెడ్డి, జె.నిషాంత్‌రెడ్డిలు సమావేశం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలపై పీవో ఖుష్బుగుప్తా చర్చలు జరిపారు.

పత్తి కొనుగోళ్లపై నిఘా కరువు


ఆదిలాబాద్ మార్కెట్ కార్యాలయం

- జిల్లాలో పత్తా లేకుండా పోయిన డిస్ప్యూట్ కమిటీలు
- తేమ పేరిట కొనుగోళ్లలో కొర్రీలు పెడుతున్న వ్యాపారులు
- నామ మాత్రంగానే కనిపిస్తున్న సీఆర్‌సీ కమిటీల పని తీరు
- క్షేత్ర స్థాయిలో కొరవడుతున్న మార్కెటింగ్ అధికారుల పర్యవేక్షణ

ఆదిలాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి కొనుగోళ్లపై అధికారుల నిఘా కరువైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 25 నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 11 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదట ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించారు. ఆ తర్వాత ఇచ్చోడ, బోథ్ మార్కెట్‌లలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను చేపడుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్న పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. గతంలో మార్కెట్ యార్డుల్లోనే తప్పని సరిగా పత్తి పంటను విక్రయించాలనే నిబంధన ఉండేది. కానీ గత రెండు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటును కల్పించడంతో రైతులు తమకు ఇష్టమైన చోట పంటను విక్రయించుకునే అవకాశం దక్కింది. జిల్లాలో 4లక్షల 34వేల ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా ఈ సారి 30 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. క్వింటాల్ పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 కాగా కొందరికి మాత్రమే మద్దతు ధర దక్కుతోంది. మెజార్టీ రైతులకు రూ.7వేల లోపే ధర పలకడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు, సీసీఐ అధికారుల మధ్య తలెత్తే సమస్యలను అధిగమించేందుకు గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సిక్తాపట్నాయక్ ప్రత్యేక దృష్టిని సారించి డిస్‌పూట్ కమిటీలను నియమించారు. దీంతో కొంత వరకు సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది. కానీ డిస్‌పూట్ కమిటీలు పత్తాలేకుండానే పోవడంతో ప్రైవేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండానే పోతోంది. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో దళారులు ఇష్టారాజ్యంగా పత్తిని కొనుగోలు చేస్తున్నా పట్టించే లేకుండా పోయిందంటున్నారు. రైతులకు మాయమాటలు చెబుతూ తూకంలో మోసం చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.

తేమతో ధరలో కోతలు

కొందరు కమిషన్ ఏజెంట్లు ఎలాంటి తేమ నిబంధనలను పట్టించుకోకుండా టోకుగా ధరను నిర్ణయించడంతో అన్నదాతలు దగా పడుతున్నారు. తేమ శాతాన్ని సాకుగా చూపుతూ ధరల్లో భారీగా కోతలు విధిస్తూ దండుకుంటున్నారు. అధిక తేమతో నాణ్యత లేదంటూ వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని మారుమూల గ్రామాల నుంచి పంటను తరలించేందుకు రవాణా ఖర్చు భారం అధికం కావడంతో స్థానికంగానే దళారులకు పంటను అమ్మేసుకుంటున్నారు. దీంతో ధర తక్కువైనా స్థానికంగానే విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదునుగా తేమ శాతం తూకంలో మోసం చేస్తున్న దళారులు లాభాలను జేబులో వేసుకుంటున్నారు. ఇదంతా మార్కెటింగ్ అధికారులకు తెలిసిన తెలియనట్లుగానే వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. కేవలం జిన్నింగ్ వ్యాపారుల పైననే దృష్టి సారిస్తున్న అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న దళారీ దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. రైతుల నుంచి సేకరించిన పత్తిని తిరిగి బినామీ రైతుల పేరిటా సీసీఐకే విక్రయిస్తూ లాభాలను దండుకుంటున్నారు.

కఠినంగా సీసీఐ నిబంధనలు

పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా 8 నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. ఆపై ఒక్క పాయింట్ ఎక్కువైనా కొనుగోళు చేసేందుకు నిరాకరిస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఈ సారి కన్‌స్టిట్యూషన్ ఆఫ్ రిజక్షన్ కమిటీ (సీఆర్‌సీ)లను ఏర్పాటు చేశారు. ఇందులో సీసీఐ సీపీఓస్, మార్కెట్ కమిటీ సెక్రెటరీలు సభ్యులుగా ఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ కమిటీ పనితీరు అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారులు స్పందిస్తున్నారు. లేదంటే తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తేమ 12 శాతాని కంటే ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ నిరాకరిస్తే క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి రైతులకు న్యాయం జరిగే విధంగా ఈ కమిటీ పని చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు కార్యాలయానికే పరిమితం కావడంతో రైతులకు అవగాహన లేక నష్టపోతున్నారు. తేమ శాతం నిర్ధారణపై ఎలాంటి అవగాహన లేని రైతులు గిట్టుబాటు కావడం లేదంటూ ఆందోళనకు గురవుతున్నారు.

అవగాహన కల్పించని అధికారులు

మార్కెట్ చట్టాలు, నిబంధనలపై రైతుల్లో కనీస అవగాహన కనిపించడం లేదు. ముందుగానే అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కలిపించి ఉంటే

(మిగతా 6వ పేజీలో)


పత్తిని తూకం వేస్తున్న దృశ్యం

కోలాహలంగా గిరిజన క్రీడోత్సవం

- తరలివచ్చిన 33 జిల్లాల క్రీడాకారులు



7

వెచ్చని దుస్తులు వచ్చేశాయ్!

- జిల్లాలో ప్రారంభమైన చలి తీవ్రత
- మొదలైన సీజనల్ వ్యాపారం



7

రైతుల ఆందోళన..

- సోయాబీన్ పంట కొనుగోలు చేయడం లేదని ఆవేదన
- అధికారులపై ఆగ్రహం



6

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

- జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం


స్టాపర్లను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణతో పాటు శాంతి భద్రత పరిరక్షణే పోలీసుల ధ్యేయమని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. గోయల్ టీఎంటీ కంపెనీ తరపున ఇక్కడి డీలర్ ఓం ప్రకాష్ సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ స్టాపర్లను అందించారు. బుధవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో వాటిని ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఓం ప్రకాష్ అగర్వాల్‌తో పాటు ఎస్పీని సత్కరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. ప్రధానకూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ స్టాపర్లను రద్దీ ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్, టూ టౌన్, ట్రాఫిక్ సీఐలు సునీల్, కరుణాకర్, ప్రణయ్ డీలర్లు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ...

ఆదిలాబాద్ జిల్లా పోలీసు సాయుధ కార్యాలయంలో బుధవారం మాబ్‌ఆపరేషన్‌పై శిక్షణ అందజేశారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం మాబ్ ఆపరేషన్ సమయంలో నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అల్లరిమూకల విధ్వంసం ఎక్కువగా ఉన్నప్పుడు రాళ్లదాడి, కర్రలతో దాడి లాంటి సందర్భాలు ఏర్పడతాయని వాటిని ఎదుర్కొనే విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళల అప్రమత్తమై ఉండాలని తెలిపారు. గాయపడిన ప్రజలను కాపాడడానికి చేయవల్సిన డ్రిల్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం జరిగింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- పాత హౌజింగ్‌బోర్డు కాలనీలో సర్వే పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి సర్వేలో ఏ ఒక్క కుటుంబం, మనిషిని వదలకుండా పూర్తిస్థాయిలో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఎన్యుమరేటర్లు, అధికారులకు సూచించారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటి గుర్తింపు సర్వే, స్టిరింగ్ ప్రక్రియను వార్డు నెంబర్ 37 పరిధిలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డులో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటి సమగ్ర కుటుంబసర్వేలో భాగంగా జిల్లా ప్రజలు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,97,000 కుటుంబాలున్నట్లు గుర్తించడం జరిగిందని, దీనికి సంబంధించిన2012 ఎన్యుమరేషన్ బ్లాక్‌లు ఉన్నాయని, 213 మంది ఎన్యుమరేటర్లను నియమించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రైమరీ స్కూల్‌టీచర్స్‌లకు ట్రైనింగ్ ఇచ్చి మొత్తం కిట్‌తో సహా వారిని సర్వేకు పంపడం జరిగిం దని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు నెంబర్ 37 కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారులతో కలిసి సమగ్ర ఇంటి సర్వేలో పలు ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని ఇంటిం టికి స్టిక్కర్ అతికించడం జరిగిందన్నారు. అటవీ ప్రాంతంలో ఉండే వారు సైతం తమ అటవీ హక్కుల పత్రాలను తమ వద్ద ఉంచుకొని సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఇండ్ల జాబితాను గుర్తించే సర్వే కొనసాగు తున్నదని, త్వరలో సమగ్ర సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సర్వేలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్‌రాజు, ఎమ్మార్వో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ అశోక్ తదితరులున్నారు.


గేర్జం గ్రామంలో స్టిక్కర్లపై వివరాల నమోదును చూస్తున్న కలెక్టర్

అధికారులకు నోటీసులు

ఇచ్చోడ:ఇంటింటి సర్వేలో భాగంగా తప్పులు నమోదు చేసిన ఇచ్చోడ ఎంపీడీఓ లక్ష్మణ్, మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాష్, గెర్జం పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ఏజాజ్ హస్మీలకు కలెక్టర్ రాజార్షిషా బుధవారం షోకాజ్ నోటీసులను జారీచేశారు. బుధవారం ఇచ్చోడ మండలంలోని గేర్జం గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ ఇంటింటి సర్వేకు సంబంధించిన సమాచారం లో మొత్తం తప్పొప్పులను చూసి అధికారులపై మండిపడ్డారు. విధుల్లో నిర్ల క్ష్యం వహిస్తే సహించేదిలేదని సర్వేపై శిక్షణలు, సమావేశాలు, గూగుల్‌మీట్, టేలికాన్ఫరెన్స్‌ల ద్వారా పూర్తి అవగాహన కల్పించినప్పటికీ విధులు సక్రమంగా నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్ : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా ఇండ్ల సంఖ్య గుర్తింపు కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని వార్డు నెంబర్.37 ఓల్డ్ హౌసింగ్ బోర్డులో చేపట్టి ఇండ్ల సంఖ్య సర్వే తీరును జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు.

సర్వేలో తప్పులు దొర్లితే ఉపేక్షించేది లేదు...

ఇచ్చోడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే, ఇంటింటి కటుంబ సర్వేను పకడ్బందీంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. బుధవారం మండలంలోని గేర్జం, ముత్రా(కె) గ్రామాలల్లో సర్వేను పరిశీలించారు. సర్వేపై అన్ని రకాల అవగాహనలు కల్పించడం జరిగిందని అధికారులు సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు.

ఫుడ్ పాయిజన్‌పై జిల్లా అధికారుల విచారణ

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంట్‌థామస్ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న యువతి మృతిచెందడంతో ఆమె మృతిపై జిల్లా వైద్యాధికారులు విచారణ ప్రారంభించారు. అసలు సదరు మహిళ ఆసుపత్రిలో చికిత్స తీసుకుందా లేదా అనే విష యాన్ని నిర్ధారించుకునేందుకు వైద్యులతో నివేదిక తెప్పించుకున్నారు. సరైన వైద్యం అందకపోవడం వల్లనే యువతి మృతి చెందిందన్న నిర్ధారణకు అధికారులు వచ్చినట్లు సమాచారం. వాస్తవానికి ఈనెల 2వ తేదీన నిర్మల్ వెళ్లి అక్కడి హోటల్‌లో భోజనం చేసి తిరిగి రావడం జరిగింది. వచ్చిన రోజు రాత్రి నుంచి తీవ్రమైన వాంతులు, విరేచనాలు కావడంతో నిర్మల్ వెళ్లిన వారంతా స్థానిక ఆసుపత్రికి వచ్చి మూడోతేదీన ఉదయం వైద్యం చేయించుకుని పాఠశాలకు వెళడం జరిగింది. అయితే 4వ తేదీన నలుగురు ఉపాధ్యాయులు వచ్చి అవసరమైన మందులను తీసుకున్నారని వంట మనిషికి మాత్రం కొన్ని మాత్రలు తీసుకుని వెళ్లారని వైద్య సిబ్బంది అంటున్నారు. అయితే మాత్రలు తీసుకొని వెళ్లిన వారు ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించకపోవడం వల్ల సరైన వైద్యానికి నోచుకోలేదని తెలిసింది. వాస్తవానికి మహిళ వైద్యం కోసం ఆసుపత్రికి రాలేదని పలువురు అంటున్నారు.

దళారులకు అమ్ముకొని దగా పడొద్దు : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం శ్రమపడి పండించిన వరి ధాన్యం పంటలను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని బీరు మండలంలోని బీర్సాయిపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. రైతుల కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీరెడ్డి, ఖయ్యుమ్, ఎక్బాల్ పాల్గొన్నారు.

రైతులు పశుపోషణపై దృష్టి సారించాలి

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కిషన్

తలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం సాగుచేసే రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కిషన్ కోరారు. బుధవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వ హించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లా డుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు పశుపోషణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదే విధంగా పశువులకు ఎలాంటి వ్యాధులు సోకిన వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వ హిస్తున్న పశుగణనకు రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం పశువులకు వ్యాధినిరోధక టీకాలను వేయించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, ప్రవీణ్, మండల పశుఅధికారి డాక్టర్ లావణ్య, మాజీసర్పంచ్ మారుతి, పశు వైద్య సిబ్బంది గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


నేరడిగొండలో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో గల దర్శన్ జిన్నింగ్‌లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతును శాలువాతో సన్మానించి పత్తితో వచ్చిన ఎడ్లబండికి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు తేమ విషయంలో సహకరించాలని, ఆదిలాబాద్ జిల్లాలో మంచు ఎక్కువగా పడే అవకాశం ఉంటుందని తేమ శాతం ఎక్కువ చూపిస్తుందని దాని వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. అదే విధంగా ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి మద్దతు ధర పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా సీసీఐ అధికారులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు బొడ్డుగంగారెడ్డి, ఆడే వసంత్‌రావ్, మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు రవీం దర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పీవీ రమణ, శివారెడ్డి, నానక్‌సింగ్, సురేందర్, గొర్ల రాజు యాదవ్ పాల్గొన్నారు.

- **సర్వేను పకడ్బందీగా చేపట్టాలి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమగ్ర కుటుంబసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సమాచారాన్ని సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావ్, మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పీవీ రమణ, బాబులాల్, శివారెడ్డి, నానక్‌సింగ్, సురేందర్, పండరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్ : మండలంలోని పలు గ్రామాల్లో మృతిచెందిన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం పరామర్శించారు. మండలంలోని కౌటా(బీ) గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బద్దం మోహన్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించి ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆర్‌ఎంపీ వైద్యులు నందకుమార్ తల్లి మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల కిడ్నీవ్యాధి బారిన పడి మృతిచెందిన సున్నపు రమేష్ కుటుంబసభ్యులను పరామ ర్శించారు. అంతేగాక గ్రామంలో యల్ల బుచ్చారెడ్డి తల్లి అనారోగ్యం భారినపడటంతో ఆమెను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎస్.రామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యా యుని సహోదరుడు ప్రభాకర్‌రెడ్డి, గ్రామ నాయకులు డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

బోథ్ : గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కుచలాపూర్ గ్రామంలో విజయ స్టీల్‌బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనర్థాలున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ నిర్మూలనపై కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన కోసం కృషిచేయాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఎంపీడీవో రమేష్, ఎంపీఈవో జీవన్‌రెడ్డి, ఏపీఎం మాధవ్, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, బోథ్ మాజీసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

తలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పండుగలు ముగిసినా పంపిణీ కాని చీరలు అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రావడంతో సిబ్బంది గ్రామాలకు వెళ్లి స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదివాసీ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగిందని ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికి బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ముళ్లపొదలను తొలగించిన యూత్ సభ్యులు



ముళ్ళపొదలు తొలగిస్తున్న సభ్యులు

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించరు అంటూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు యువజన సంఘం సభ్యులు ముందుకు వచ్చారు. మండలంలోని కౌటా (బీ) గ్రామానికి చెందిన వివేకానంద యూత్ సభ్యులు గ్రామ సమీపంలోని రహదారిపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో యూత్‌అధ్యక్షులు అబ్దుల్, సభ్యులు సోమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేసేంత వరకూ ఆందోళన చేస్తాం

జైనథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసేంత వరకూ ఆందోళన నిర్వహిస్తామని అఖిల పక్షం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండిదత్తాత్రి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జైనథ్‌లోని మండల రెవెన్యూ కార్యాలయం ముందు అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్‌లతో కూడిన మెమోరాండాన్ని జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బండిదత్తాత్రి మాట్లాడుతూ రెండు విడతల రైతు భరోసా పథకం డబ్బులను నేరుగా రైతు ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. పత్తి పంటకు మద్దతు ధర చెల్లించడంతో పాటు సోయాబీన్ తేమ శాతం 18కి పెంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రాములునాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

సిరికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో రైతు కమిషన్ మెంబర్ రాములు నాయక్‌ను సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పొన్న గ్రామానికి లింక్ రోడ్లు, నీటిపారుదల సౌకర్యం కోసం నూతన చెరువును మంజూరు చేయించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ, సంబంధిత శాఖల మంత్రులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

8న తాంసిలో లోక్ అదాలత్

తాంసి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఈనెల 8న లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అడ్వకేట్ ఉమేష్‌డోలే పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఏవైనా పాత సమస్యలుంటే వెంటనే పరిష్కరించుకోవచ్చన్నారు.

సోయాబీన్ కొనుగోలు చేయడం లేదని రైతుల ఆందోళన


మార్కెట్ యార్డులో చైర్మన్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

బోథ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బోథ్‌మార్కెట్ యార్డులో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న సోయాబీన్ పంట తూకంలో జాప్యం జరుగుతుండడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం సాయంత్రం మండలంలోని కుచలాపూర్ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి అనే రైతు వారం రోజులుగా తాను సోయాబీన్ పంటను తీసుకువచ్చారని ఆయన కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుందని ఆగ్రహించారు. తన గోడును మార్కెట్ కమిటీ చైర్మన్‌కు విన్నవించగా తాను సమస్యను మార్క్‌ఫెడ్ అధికారులకు వివరిస్తానని చైర్మన్ గంగారెడ్డి పేర్కొన్నారు. అయితే తన సమస్యకు పరిష్కారం దొరకలేదని చావే గతి అంటూ ఓ రైతు తన వెం ట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా మూత తెరిచి తాగేందుకు ప్రయత్నించాడు. పక్కనే ఉన్న కొంత మంది రైతులు డబ్బాను తీసుకుని కింద పడేయడంతో ఆత్మహత్యాయత్నం తప్పింది. మార్కెట్ యార్డులో పంట కొనుగోలు విషయంలో హమాలీల జాప్యం జరుగుతుందని కొంత మంది రైతులు వాపోయారు. మార్కెట్ యార్డులో హమాలీల దోపిడీ పెరిగిందని, వారిని కట్టడి చేయాల్సిందేనని బోథ్ పట్టణానికి చెందిన రైతు సూర్యంరెడ్డి పేర్కొన్నారు. కొంత మంది రైతులు హమాలీలకు అడ్డు పడతారన్న ఉద్దేశంతో ముందుగా వారి పంటను తూకం వేసి పంపించి వేస్తారని, అయితే అమాయకులైన గ్రామీణ ప్రాంతాల రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.62లు తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే హమాలీ డబ్బులు ఎవరు కాజేస్తున్నారని రైతు అధికారులను ప్రశ్నించారు. కాగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో తూకం వేసిన 2,529 బస్తాలు నిల్వఉన్నాయని తూకం వేసిన బస్తాలు లోడింగ్ పూర్తిచేసిన తరువాతనే ఈనెల 9 నుంచి కాంటాను చేయించడం జరుగుతుందని సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి పేర్కొన్నారు. అయితే బస్తాలను కుట్టేందుకు కొత్తగా ఆరుమెషిన్లను తెప్పించడం జరిగిందని అయితే అవి చెడిపోవడంతో మరో రెండు కొత్తగా తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని త్వరలోనే పూర్తి స్థాయిలో కొనుగోలు చేపడతామన్నారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే

ఇంద్రవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్రసర్వేకు ప్రజలందరూ సహకరించాలని మండల తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలనీలో సమగ్ర సర్వేను ప్రాంభించి ఆయన మాట్లాడారు. ఇంటింటి కుటుంబ సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కులగణనను మండలంలో విజయవంతంగా పూర్తిచేస్తామని, ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయితీ ఈవో సంజీవ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. ముందు ఆయా గ్రామాల్లో కార్యదర్శులు నివాసగృహాలను సందర్శించి వాటికి స్టిక్కర్లు అతికించారు. మధ్యాహ్నం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. కుచలాపూర్‌లో జరిగిన సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో రమేష్‌తోపాటు ఎంపీఈవో జీవన్‌రెడ్డి, ఏపీఎం మాధవ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పాల్గొని పరిశీలించారు.

సిరికొండ: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి పణీందర్ అన్నారు. బుధవారం ఆయన తహసీల్దార్ తుకారంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ ఉపేందర్, ఎంపీవో సంతోష్, బీఆర్ఎస్ నాయకులు ఒరగంటి పెంటన్న, తోకల చందు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కులగణన సంప్రదింపుల సదస్సు

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు జిల్లాకు చెందిన ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్‌లు పాల్గొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరుకాగా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్‌మున్షి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్య మంత్రి మల్లుభట్టి విక్రమార్కలు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

తలమడుగు: సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ మండల ప్రత్యేక అధికారి గజానంద్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన ప్రారంభించారు. వివరాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటికి స్టిక్కర్‌ను అతికించారు.

సైబర్‌క్రైమ్‌పై అవగాహన


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా

ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ జాగృతి దివాస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ సందర్భంగా ఆదిలాబాద్ సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పై సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసిబుల్లా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సీనియర్ సిటిజన్స్ పై సైబర్ క్రైమ్ నేరగాళ్లు ఉపయోగిస్తున్న తీరును వారికి వివరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని పిట్టబొంగరం గ్రామ పంచాయితీ పరిధిలోని పాటగూడ గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం పాటగూడ గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్ (25)కు గత మూడేళ్ళ క్రితం బోథ్ మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన కోసుబాయితో పెళ్ళి అయింది. గత సంవత్సరం కాలం నుంచి శ్రీనివాస్ మానసిక వ్యాధితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆరు నెలల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా కొంత ఆరోగ్య పరిస్థితి మెరుగు పడింది. గత నెల రోజులుగా మళ్ళీ మానసిక మతి స్థిమితంకోల్పోయి ఎవరితోనూ మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయ పనులు చేసి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.వెంటనే గ్రామస్తుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పాటగూడ గ్రామానికి చేరుకుని గేడం శ్రీనివాస్ ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పత్తి కొనుగోళ్లపై నిఘా కరువు

(5వ పేజీ తరువాయి)

కొంత ప్రయోజనం ఉండేది. అమాయక నిరక్షరాస్యులైన అన్నదాతల్లో అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. ఇప్పటికే కన్‌స్ట్రిట్యూషన్ ఆఫ్ రిజక్షన్ కమిటీని ఏర్పాటు చేసిన దానిపై రైతుల్లో అవగాహన కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఏ ఒక్క గ్రామంలో పంటల మద్దతు ధరలు, మార్కెటింగ్ నిబంధనలపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను సాకుగా చూపుతున్న దళారులు తేమ శాతం తూకంలో భారీగా కోతలు విధిస్తున్నారు. పంట కొనుగోళ్లకు ముందే గ్రామ స్థాయిలో తేమ శాతం, మార్కెట్ నిబంధనల పై అవగాహన కల్పించి ఉంటే కొంత వరకు ప్రయోజనం ఉండేది. కీలకంగా వ్యవహరించాల్సిన వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాలి నడకన వెళ్లి.. వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ఫరాజ్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 06 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది కాలినడకన వెళ్లి వైద్యం అందించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖండాల సబ్‌సెంటర్‌లోని రాజుగూడ కోలాం గిరిజన గ్రామాన్ని బుధవారం వైద్యసిబ్బంది సందర్శించారు. గ్రామానికి వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో వాహనాలను మధ్యలోనే ఆపి నడుచుకుంటూ వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్ఫరాజ్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మోహిజుద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు రాథోడ్ చంద్రకళ, పవర్ ప్రేమ్ సింగ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొలువులే కాకుండా ప్రభుత్వం తరఫున ప్రైవేట్ రంగంలో కల్పించే ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మిల్కా అన్నారు. బుధవారం ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో కేఎల్ గ్రూప్ సంస్థలో సూపర్‌వైజర్, హెల్పర్స్ కోసం జాబ్ మేళా నిర్వహించారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలి

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 06 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల డీఏలను వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శశికాంత్ డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

పిప్పల్‌కోటిలో పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం

భీంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటిలో జిల్లా పశుగణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని నిర్వహించారు. 150 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స అందించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మనిచ్చిన దూడలకు నట్టల నివారణ మందులను ఉచితంగా అందించారు. ఏడీ రామారావు రాథోడ్, మాజీ వైఎస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, మండల వెటర్నరీ అధికారి సుభాష్ రాథోడ్ పాల్గొన్నారు.

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే బహిష్కరణ

- దిలావర్‌పూర్ గ్రామస్థుల తీర్మానం
- ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా నిర్ణయం


ఎంపీడీవో అరుణరాణికి తీర్మానపత్రం అందజేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

దిలావర్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేను దిలావర్‌పూర్ గ్రామస్థులు బహిష్కరించారు. ఈ మేరకు గ్రామాభివృద్ధి కమిటీ తీర్మానం చేసింది. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఏడాది కాలంగా గాంధీమార్గంలో ఉద్యమం చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల నిరసనగా ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదన్నారు. గ్రామస్తులు సమగ్ర సర్వేను బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ స్వాతిలకు తీర్మాన పత్రాలను అందజేశారు. ఇథనాల్ పరిశ్రమ ఇక్కడి నుంచి తరలించడమే గ్రామస్తుల మొదటి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. పచ్చని పంట పొలాల మధ్య ఇథనాల్ పరిశ్రమ నిర్మించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తప్పుడు సమాచారంతో యాజమాన్యం అనుమతులు తెచ్చుకుందని ఆరోపించారు. ఇథనాల్ పరిశ్రమ తరలించకపోతే ఏం చేయాలో మాకు తెలుసని అన్నారు. మేధావులు, పర్యావరణ వేత్తలు, వ్యవసాయ నిపుణులు, శాస్త్ర వేత్తల సలహాలతో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుని తీరుతామన్నారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాభిప్రాయం పరిగణలోకి తీసుకుని ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మత్సకారుల ప్రగతికి బాధ్యతతో కృషి

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా నియోజక వర్గ పరిధిలోని మత్సకారుల ప్రగతికి, సంక్షేమానికి బాధ్యతాయుతంగా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం భైంసా గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మత్సశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల వదిలి పెట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన మత్సకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేయూతనిచ్చేందుకు పాటుపడుతానని వెల్లడించారు. ఇందులో మత్సశాఖాధికారులు, భైంసా ఏఎంసీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, డైరెక్టర్ తోట రాము, పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్, బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్వర్ పాటు మత్సకారులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కుభీర్, నవంబరు 6 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రాంరావుపాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాగేష్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కాంటాలకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ , మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్, బీజేపీ నాయకులు గ్రామస్థులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

భైంసా రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, జడ్పీటీసీ సోలంకి భీమ్‌రావు, మాజీ ఎంపీపీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కులగణనతో ప్రతీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత లభిస్తుంది

- కులగణనను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది
- ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొక్కవోని విశ్వాసంతో ముందుకు వెళ్తున్నారు
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


సత్తనపెల్లిలో కుల గణన కార్యక్రమంలో వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలం గాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్య క్రమంతో అన్నిరంగాల్లో సామాజిక వర్గానికి సరైన గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలో బొజ్జు విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుర్జాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఖానాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం సత్తనపల్లి గ్రామంలో నిర్వహించిన కుల గణన సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా భావిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణనపై ఎవరెన్ని మాట్లాడినా మొక్కవోని విశ్వాసంతో ముందుకు వెళ్తన్నారన్నారు. కుల గణనకు పార్టీలకు అతీతంగా కుల, మతాలకు అతీతంగా ప్రతీఒక్కరూ సహకరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ అద్భుత నిర్ణయంతో మన రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కుల గణనపై రాజకీయం చేయకుండా నిర్మాణాత్మక సూచనలను చేస్తే ప్రభుత్వం స్వీకరిస్తుందన్నారు. అలా కాకుండా తమ ఇష్టారీతిన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని బొజ్జు హెచ్చరించారు. ఈ వేరు వేరు కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు జన్నారపు శంకర్, జంగిలి శంకర్, గుడాల రాజన్న, సార్ల నర్సయ్య, మ్యాదరి రాజేశ్వర్, తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ఏబీవీపీ ఆందోళన

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- ప్రధాన రోడ్డుపై భైఠాయించి ధర్నా


బస్టాండ్ ఎదుట ప్రధాన రోడ్డుపై భైఠాయించిన ఏబీవీపీ శ్రేణులు

భైంసా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోనున్న స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భైంసాలో ఏబీవీపీ శ్రేణులు చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. బుధవారం ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ ఖైరి శశిందర్ నేతృత్వంలో డివిజన్ ప్రతినిధులు శివ కుమార్, దినేష్, సాయి, గంగా ప్రసాద్, ఆకాష్, సాయి కుమార్, శశాంక్,బాలుల సారథ్యంలో యూనియన్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. ఆయా ప్రైవేట్ కళాశాలల నుంచి ర్యాలీగా బస్టాండ్ వరకు తరలివచ్చిన ఏబీవీపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాన రోడ్డు మార్గంపై భైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ ఖైరి శశిందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లోనున్న రూ.7800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలివేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విద్య వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏరి కోరి తెచ్చుకున్న తెలంగాణలో ఉచితాలు, ఓటు బ్యాంక్ రాజకీయాలు, రాజకీయ శ్రేణుల స్వార్థపూరిత విధానాలతో విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడితే సహించేది లేదన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల అవ్వక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్‌లోనున్న నిధుల విడుదలను వెంటనే చేపట్టాలన్నారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనతో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

గీత కార్మికులు రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలి

నిర్మల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కల్లు గీత కార్మికులు వృత్తిరక్షణకు రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నిర్మల్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో 4వ మహాసభలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్ అధ్యక్షత వహించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సిద్ధి రాములు గౌడ్ మాట్లాడుతూ... కల్లు గీత కార్మికులు కల్లు గీత వృత్తి రక్షణ, రాజ్యాధికారం సాధించాలంటే రాజకీయాలకు అతీతంగా సంఘటితంగా ఉద్యమించాలన్నారు. జిల్లాలో వీడీసీలు గౌడ కులస్తుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆబ్కారీశాఖ అధికారుల దాడులు పెరిగాయని వీటిని ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కల్లు గీత కార్పొరేషన్ కార్యవర్గం ఏర్పాటు చేసి ఐదు కోట్ల రూపాయలు కేటాయించి సబ్సిడీపై రుణాలందించాలని కోరారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలన్నారు. నీరా కేఫ్‌లను విస్తరించి గౌడకులస్తులకు అప్పగించాలని, దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేసి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు కే. బాలరాజ్ గౌడ్, శ్రీపతి లింగాగౌడ్, నారాయణ గౌడ్, జిల్లా నాయకులు టి. వెంకట్‌గౌడ్, గోపిగౌడ్, పిసర శ్రీనివాస్‌గౌడ్, కనుకగౌడ్, దశగౌడ్, మురళీగౌడ్, గౌడ కులస్తులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

అంబాబాయి కుంట ఆక్రమణలు తొలగించాలి

- సర్వే చేసి నివేదిక ఇవ్వండి
- తహసీల్దార్‌ను ఆదేశించిన అదనపు కలెక్టర్


న్యూ లోలం గంగపుత్రులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

దిలావర్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం న్యూ లోలం గ్రామానికి చెందిన అంబాబాయి కుంటను పరిశీలించారు. కుంట శిఖం విస్తీర్ణంపై ఆరా తీశారు. గ్రామానికి చెందిన గంగపుత్రులు ఇటీవల ప్రజావేదికలో 29.16 ఎకరాలున్న అంబాబాయి ఆక్రమణలకు గురై కుంచించుకు పోతోందని కుంటను కాపాడాలని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అంబాబాయి కుంటను పరిశీలించారు. భూ రికార్డులను పరిశీలించడంతో పాటు శిఖం సర్వే చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ స్వాతిని ఆదేశించారు. అంబాబాయి కుంట శిఖం సర్వే చేసి కుంట రక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ న్యూ లోలం గంగపుత్రులకు హామీ ఇచ్చారు. దిలావర్‌పూర్ తహసీల్దార్ స్వాతి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంతోష్, మండల సర్వేయర్ సాయిలు, ఇరిగేషన్ ఏఈ గంగాధర్, గంగపుత్రులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేలో అధికారులకు సహకరించాలి

కుంటాల, నవంబర్, 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు పూర్తి స్థాయిలో అధికారులకు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని మెదన్‌పూర్ గ్రామంలో సర్వేను పరిశీలించారు. తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగ న్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. భవనాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, ఎంపీవో ఎంఏ అబ్దుల్ రహీం, పీఆర్‌డీఈ రాజేందర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద నివారణ పరికరాలపై
అవగాహన పెంచుకోవాలి

భైంసా, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు గాను వాటిని నివారించే పరికరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని భైంసా అగ్నిమాపక సిబ్బంది సూచించింది. బుధవారం పట్టణ పరిధిలోని పలు వ్యాపార సంస్థల్లో ఫైర్‌మెన్లు నర్వాడే విలాస్, కె.సాయి కిరణ్‌లు అగ్ని ప్రమాద నివారణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ప్రతి వ్యాపార సంస్థలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

పెంబి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ రాధా శ్రీనివాస్ అత్తమ, ఇటిక్యాల్ గ్రామానికి చెందిన సీమల జయ, బుట్టి నరసింహులు మృతి చెందడంతో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్‌నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ సుధాకర్ ఉన్నారు.

క్రీడా సంరంభం!!


ఉట్నూర్ ఐటీడీఏ, ఏటూరు నాగారం ఐటీడీఏ 17 ఏళ్ల బాలికల జట్ల మధ్య కబడ్డీ పోటీ


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు


బాలికల ఖోఖో పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కోలాహలంగా గిరిజన క్రీడోత్సవం


● అర్చరీ పోటీల్లో పాల్గొన్న బాలికలు

● ఉట్నూర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ● తరలివచ్చిన 33 జిల్లాలకు చెందిన 1600 మంది క్రీడాకారులు

ఉట్నూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలకు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. 33 జిల్లాలకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న 1600 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఉట్నూర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడలను నిర్వహిస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ వన్, ఉట్నూర్ ఐటీడీఏ టూ, భద్రాచలం, ఏటూరు నాగారం, ఐటీడీఏ ప్లెన్‌వన్, ఐటీడీఏ ప్లేన్‌టూ ప్రాంతాలలోని గిరిజన విద్యార్థులను 14, 17 ఏళ్ల బాల బాలికలను జోనల్ జిల్లా స్థాయలలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు తెచ్చారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ అర్చరీ, టెన్నికాయిట్, కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన క్రీడాపోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. కబడ్డీ బాల బాలికలు, వాలీబాల్ బాల బాలికలు, అథ్లెటిక్స్ బాల బాలికలు, కోకో బాల బాలికల మధ్య పోటీలు హోరాహోరీఆగా సాగుతున్నాయి. బుధవారం లీగ్ మ్యాచ్‌లు పూర్తి చేసి చివరి రోజైన గురువారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని డీడీజాదవ్ వసంతరావు, రాష్ట్ర క్రీడల అధికారి జ్యోతిలు తెలిపారు. మంచిర్యాల, నిర్మల్, డీటీడీఓలు మడావి గంగారాం, జాదవ్ అంబాజి, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు సుమారు 300 మంది క్రీడా పోటీల నిర్వహణలో పాల్గొంటూ పరిశీలిస్తున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ డీడీ వసంతరావు, ఏటీడీవోలు క్రాంతి కుమార్, అమిత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో వసతి భోజన సౌకర్యాలు పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

● అథ్లెటిక్స్ విజేతలు వీరే..

14ఏళ్ల షాట్‌పుట్ బాలికల విభాగంలో ఉట్నూర్ ఐటీడీఏ ప్రథమ బహుమతి, శ్రీలత ఉట్నూర్ ఐటీడీఏ ద్వితీయ, ఈ వెన్నెల భద్రాచలం ఐటీడీఏ తృతీయ స్థానాలు దక్కించుకోగా బాలుర విభాగంలో ఆర్ క్రాంతి ఉట్నూర్ ఐటీడీఏ ప్రథమ, కేశంబు, ఉట్నూర్ ఐటీడీఏ ద్వితీయ, బి. సంగమేశ్‌ప్లేన్ ఐటీడీఏ వన్, తృతీయ బహుమతి సాధించుకున్నారు. షాట్‌పుట్ 17ఏళ్ల బాలుర విభాగంలో ఎస్ అభి ఉట్నూర్ ఐటీడీఏ ప్రథమ, పి.సతీష్‌కుమార్ ఉ ట్నూర్ ఐటీడీఏ ద్వితీయ, పి.అజయ్ భద్రాచలం ఐటీడీఏ తృతీయ 17 ఏళ్ల బాలికల విభాగం షాట్‌పుట్‌లో బి.పూజ ఉట్నూర్ 2 ఐటీడీఏ ప్రథమ, కె.జోష్నా ఉట్నూర్ వన్ ఐటీడీఏ ద్వితీయ, సీహెచ్ ప్రణవి ఏటూరు నాగారం ఐటీడీఏ తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. 400 మీటర్ల రన్నింగ్ 14 ఏళ్ల బాలుర విభాగంలో హిరాకుంర నగేష్ ఉట్నూర్ 1 ఐటీడీఏ, కె.జాకేష్ ఉట్నూర్ టూ ఐటీడీఏ,ఎం చరణ్‌దాస్ ఏటూరు నాగారం ఐటీడీఏ తృతీయ, బాలికల విభాగంలో మహాలక్ష్మి ఉట్నూర్ టూ ఐటీడీఏ ప్రథమ, ఎం. శాంతి భద్రాచలం ద్వితీయ, పి.పావని భద్రాచలం ఐటీడీఏ తృతీయం బహుమతులకు ఎంపికయ్యారని అన్నారు. 1500 మీటర్ల పరుగు పందెం 17ఏళ్ల బాలికల విభాగంలో ఎం.శాంతి ఉట్నూర్ టు ఐటీడీఏ ప్రథమ, ఎస్.శిరీష ఉట్నూర్ టూ ఐటీడీఏ ద్వితీయ పి.భువనేశ్వరి భద్రాచలం, ఐటీడీఏ తృతీయ, బాలుర విభాగంలో అక్షయ్ రోహన్ భద్రాచలం ఐటీడీఏ ప్రథమ, నివాస్ ఉట్నూర్ వన్ ఐటీడీఏ ద్వితీయ సంతోష్, ఏటైరు నగరం ఐటీడీఏ తృతీయ, 400 మీటర్ల 17 ఏళ్ల బాలుర పరుగు పందెంలో ఏం సంతీష్ ఏటూరు నగరం ఐటీడీఏ, మహేశ్ ఉట్నూర్ వన్ ఐటీడీఏ, పి.రమేష్ ఉట్నూర్,బాలికల విభాగంలో పి.దుర్గా భద్రాచలం ఐటీడీఏ ప్రథమ చిన్నబ్బాయి, ఊర్లో రైట్ డీఏ, అమృత భద్రచలం ఐటీడీఏ తృతీయలు విజయం సాధించారని అధికారులు పేర్కొన్నారు.


● వాలీబాల్ ఆడుతున్న బాలికలు

ఏర్పాట్లు చాలా బాగున్నాయి

: శంకర్, విద్యార్థి, జాతర్ల



గిరిజన సంక్షేమ విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలలో అధికారులు చేపట్టిన ఏర్పాట్లు బాగున్నాయి. క్రీడల నిర్వహణలో కూడా ఎలాంటి పక్షపాతం లేకుండా క్రీడలు నిర్వహిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా క్రీడలు కొనసాగుతున్నాయి.

భోజనంతో పాటు వసతి బాగుంది

: రాకేష్, అచ్చంపేట



మంగళవారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడాపోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు నాణ్యమైన భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం రాత్రి భోజనం అందిస్తున్నారు. పడుకోవడానికి వసతి సౌకర్యాలు కూడా మెరుగ్గానే ఉన్నాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థుల సంక్షేమం పరిశీలిస్తున్నారు.

జర దేఖో!!


బురదమయంగా మారిన ఇచ్చోడ ప్రధాన రహదారి


బురదగుంతలో ఇరుక్కుపోయిన ఆటోను నెడుతున్న ప్రజలు

బురద దారి.. ఆదమరిస్తే అంతే!

● భయపెడుతున్న ఇచ్చోడ ప్రధాన రహదారి

ఇచ్చోడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తాలో రోడ్డు అధ్వానంగా మారింది. ఇచ్చోడ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు పెరిగింది. రోడ్డుపై ఓవైపు కంకర కుప్పలతో విస్తరణ పనులు కొనసాగుతుండడంతో.. ఒకే వైపు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాల రద్దీ పెరగడంతో భారీ గుంతలు ఏర్పడి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు బురదలో కురుకుపోయి అదుపుతప్పుతున్నాయి. వర్షాలు లేకున్నా.. రహదారులు బురదమయంగా మారుతున్నాయి. మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా ఇచ్చోడ ప్రధాన రహదారులను ఆనుకొని తవ్వి పైపు లైన్లు ఏర్పాటు చేశారు. ఇటీవల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భగీరథ పైపులైన్ల లీకేజీల నుంచి నీరు రహదారులపై నిలిచి దారులు బురదమయంగా మారుతున్నాయి. ఈ రోడ్డుగుండా ప్రజలు వెళ్లలాంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాలు నడపడానికి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులపై బురద ఉండడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే రోడ్డుపై బురదను తొలగించి ఇబ్బందులను తీర్చాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.


● అమ్మేందుకు సిద్ధంగా ఉన్న స్వెటర్లు, మఫ్లర్లు, క్యాప్‌లు


● వివిధ రకాల చిన్నపిల్లల స్వెటర్లు

చలికాలం నేస్తాలు!!


● విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన క్యాపులు

వెచ్చని దుస్తులు వచ్చేశాయ్!

● జిల్లాలో ప్రారంభమైన చలి తీవ్రత ● మొదలైన సీజనల్ వ్యాపారం ● అందుబాటులో రకరకాల ఉన్ని, ఉలాన్ దుస్తులు



ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శీతాకాలం మొదలు కావడంతో వెచ్చని దుస్తులు వచ్చేశాయ్. జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతుంది. కార్తీక పౌర్ణమి మొదలు కావడంతో చలి పంజా విసురుతుంది. ఉదయం సమయంలో వాకింగ్‌కు వెళ్లే వారంతా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి వెళ్లాల్సి వస్తుంది. దీంతో చలి పుణ్యమా అంటూ జిల్లాలో ఉన్ని దుస్తుల, స్వెటర్లు, మంకీ క్యాప్, మఫ్లర్‌లు సీజనల్ వ్యాపారం జోరుగా ఊపందుకుంటోంది. ప్రస్తుతం అంతా స్వెటర్ల ట్రెండ్ కనిపిస్తోంది. ఒడిషా, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచే కాకుండా నేపాల్ నుంచి వచ్చిన వ్యాపారులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానం, ఎన్టీఆర్ చౌక్ చుట్టు పక్కల ప్రాంతాలలో ప్రధాన రహదారులపై స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్స్, వెచ్చని దుస్తులను విక్రయిస్తున్నారు.

మాకు ఇదే జీవనాధారం..

: రాజేష్‌తివారి, దుకాణదారుడు, ఆదిలాబాద్

ప్రతి చలి కాలం జిల్లా కేంద్రంకు వచ్చి దుప్పట్లు బ్లాంకెట్స్, స్వెటర్స్ అమ్ముతుంటాము. ఇదే మాకు జీవనాధారం. ఇక్కడ మేము చలికాలం మొదటి నుంచి పూర్తయ్యే వరకు వ్యాపారం చేస్తాం. పంజాబ్ నుంచి తీసుకువచ్చిన బ్లాంకెట్, స్వెటర్లు దుప్పట్లు తక్కువ ధరకే విక్రయాలు జరుపుతాం. అంతేకాకుండా వాటిని సమీపంలోని గ్రామాల్లో తిరుగుతు వ్యాపారం సాగిస్తున్నాం. తమకు ఇదే జీవనాధారమని వ్యాపారులు చెబుతున్నారు.

● అందుబాటులోనే ధరలు..

జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగానే ఉండడంతో వెచ్చని దుస్తులకు భలే డిమాండ్ కనిపిస్తుంది. అంతేకాకుండా ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్ని దుస్తులు తక్కువ ధరలకే లభ్యమవుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారుల వద్ద వెచ్చని దుస్తులను కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల పాటు ఈ సీజనల్ వ్యాపారం కొనసాగుతోంది. నాణ్యత, డిజైనలను బట్టి స్వెటర్లు రూ.300 నుంచి రూ.600ల వరకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా చెవులకు రక్షణగా నిలిచే కాన్ పట్టీలు రూ.40 నుంచి రూ.100 వరకు లభ్యమవుతున్నాయి. పెద్ద దుకాణాలలో కూడా నాణ్యమైన స్వెటర్లు రెయిన్‌కోట్ జర్కిన్‌లు రూ.600 నుంచి రూ.1200 వరకు, మంకీ క్యాపులు రూ.50 నుంచి ప్రారంభం కాగా గ్లౌజులు వంద రూపాయల లోపే లభిస్తున్నాయి.


● గుట్టల నడుమ ఖండాల గ్రామం



● ఖండాల గ్రామంలో సూర్యాస్తమయం


ఫొటో న్యూస్

ప్రకృతి ప్రతిబింబం.. ఖండాల గ్రామం!!

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పచ్చని అడవుల నడుమున ఉన్న ఆ గిరిజన గ్రామం శోభ ఇది.. చెయ్యి తిరిగిన చిత్రకారడు గీసిన బొమ్మల కనిపిస్తున్న ఈ చిత్రం సహజమైన పల్లె జీవన చిత్రమే.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గిరిజన గ్రామం ఖండాల.. గుట్టల నడుమన ప్రశాంతంగా ఉన్నది.. ఉదయం, సాయంత్రం ఈ పల్లె అందాలు వీక్షించవలసిందే.. ఈ పల్లె అందాలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.


● ఖండాల గ్రామంలో పనులు చేసుకుంటున్న గ్రామస్థులు


● గ్రామంపై కమ్ముకున్న పొగమంచు



పుణ్యక్షేత్రాలకు 'కార్తీక' ప్రత్యేక బస్సులు : డీఎం

నిర్మల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరానికి ఈ నెల 11న ఉదయం 5 గంటలకు నిర్మల్ నుండి బయలుదేరి అక్కడి నుంచి మధ్యాహ్నం 1:30కి బయలుదేరి సాయంత్రం 7 గంటలకు నిర్మల్ చేరుకుంటుందన్నారు. ప్రతిశని, ఆది, సోమవారాలు వేముల వాడకు బస్సు నడుపనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని కోరారు.

పొద్దంతా పోగేసి రాత్రుల్లో తరలింపు





ఇసుకను తరలిస్తుండగా పంచర్ అయ్యి నిలిచిపోయిన ట్రాక్టర్ (ఫైల్)



ఇసుకను తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నెంబర్‌ప్లేట్ లేని ట్రాక్టర్లు (ఫైల్)

నిల్వ చేసిన ఇసుకను లారీల్లో తరలిస్తున్న దృశ్యం

- ఖానాపూర్ ప్రాంతంలో మళ్లీ జోరందుకున్న ఇసుక అక్రమ దందా
- అనుమతుల పేరిట అక్రమార్కులకు అధికారుల అండ
- ఒక్క చలానాతో పదికి పైగా వాహనాల్లో ఇసుక తరలింపు
- ఖానాపూర్, కడెం నుంచి నిర్మల్, భైంసా, బాసరలకు ఇసుక
- తెరవెనుక ఒక్కటవుతున్న అధికార, ప్రతిపక్ష నాయకులు...?
- కడెం మండలం చిట్యాల శివారులో జోరుగా ఇసుక తవ్వకాలు

ఖానాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విలువైన ప్రకృతి సంపదను దోచుకొని కోట్ల రూపాయలను కొల్లగొట్టడమే లక్ష్యంగా కొంతమంది అక్రమార్కులు తమ మెదళ్లకు పని చెబుతున్నారు. ఇందులో భాగంగా ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించే ప్రకృతి వనరులైన ఇసుక, కలప, మొరం, పునాదిరాళ్లు లాంటి ప్రకృతి వనరులను తమదైన శైలిలో దోచుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. వీరి అక్రమదందాకు అధికారులు అడ్డు చెప్పకుండా కొంత మందిని అధికార బలంతో మరి కొంతమందిని ఆర్థికబలంతో కట్టడి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పవర్‌లో ఉన్న నేతల పేర్లను వాడుకొని వారికి తాను అత్యంత సన్నిహితులని అంటూ చెప్పుకునే కొంతమంది నాయకులు అధికారులను భయపెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమదందా ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగించేందుకు క్షేత్రస్థాయిలో అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా నాయకులంతా ఒక్కటయ్యి జేసీబీలు, ట్రాక్టర్లను కొనుగోలు చేసి ఇసుక, మొరం దందాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నిన్న, మొన్నటి వరకు ఖానాపూర్ ప్రాంతంలో మొరందందాపై జోరుగా ఆరోపణలు వినిపించిన నేపథ్యంలో తాజాగా అనుమతుల పేరిట ఈ దందాకు రాజముద్రను వేసుకున్నట్లు చెబుతున్నారు. ఇక మొరం దందాపై రచ్చ ముగిసిన నేపథ్యంలో తాజాగా ఇసుక అనుమతులు తెరపైకి వచ్చాయి. ఈ అనుమతుల్లో భాగంగా బాసర ప్రాంతంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పనుల కోసం ఖానాపూర్ మండలంలోని రాజురా ప్రాంతంలోని పల్కేరు వాగు, ఖానాపూర్ ప్రాంతంలోని రెంకోని వాగు నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇసుకను అధికారుల ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ పనుల ఉపయోగం కోసం తరలించే క్రమంలో ఏ వాహనంలో తీసుకెళ్తున్నారో ప్రభుత్వానికి చలానా కడుతూ సదరు వాహనం నంబర్ అధికారులకు చెబితే ఆ వాహనానికి అనుమతి ఇస్తుంది. అధికారికంగా ఈ ప్రక్రియ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ సదరు ఇసుక కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్క వాహనానికి ప్రభుత్వానికి చలానా చెల్లించి పదికి పైగా వాహనాల్లో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అక్రమ దందా కు సహకరించేందుకు మండల స్థాయి నుంచి మొదలుకొని జిల్లా స్థాయిలో ఉన్న ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు ప్రతిఫలం ముట్ట చెబుతున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి.

రోజుకో కొత్త ఎత్తుగడ

ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో లభించే విలువైన ఇసుక నిల్వలను తరలించేందుకు అక్రమార్కులు రోజురోజుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఒకరేమో అనుమతులున్నాయంటూ ఇసుకను తరలిస్తుంటే మరి కొంతమంది స్థానిక అవసరాల కోసం అంటూ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పొద్దంతా సేకరించి శివారు ప్రాంతాల్లో నిల్వ చేసి రాత్రి వేళలో లారీలను నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకు గాను ఒక్కొక్క లారీ ద్వారా రూ. 50 వేల నుండి రూ. 60 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు సమాచారం. కడెం మండలం చిట్యాల సమీపంలోని గోదావరినదిలో జోరుగా ఇసుక తవ్వకాలను చేపట్టి ట్రాక్టర్ల ద్వారా అడవి మార్గం గుండా ఇసుకను తరలించి శివారు ప్రాంతాల్లో నిల్వ చేసి రాత్రి వేళల్లో ఇసుకను నిర్మల్, భైంసా ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు.

అక్రమ దందాకు అధికారుల సహకారం...?

ప్రకృతి వనరులను కొల్లగొట్టడమే లక్ష్యంగా కొంతమంది సాగిస్తున్న అక్రమదందాకు అధికారుల అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చలానా కడుతున్నారంటూ ఒక్క వాహనం పేరిట రసీదు చింపి లెక్కకు మించి వాహనాలలో ఇసుకను తరలిస్తున్న అధికారులు పట్టించుకోకుండా 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల్లో ఉన్న లొసుగులను వాడుకొని ఎలా ఇసుకను అక్రమంగా తరలించవచ్చో కొంతమంది అధికారులే ఈ అక్రమార్కులకు సలహాలు, సూచనలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల స్థాయిలో అనుమతులను ఇచ్చే అధికారం ఉన్న ఓ అధికారి ఎవరు పట్టుకున్నా వాహనం తిరిగి తన వద్దకే వస్తుందని మీకు ఎటువంటి ఢోకా ఉండదంటూ భరోసా కల్పిస్తూ మరీ తన సహకారానికి తగిన ప్రతిఫలాన్ని పొందుతున్నట్లు పుకార్లు చెక్కర్లు కొడుతున్నాయి. నంబర్ ప్లేట్లు కూడా లేని వాహనాలను వినియోగిస్తూ ... ఇసుక దందాను సాగిస్తుం... డడం చూస్తే ఈ అక్రమా... ర్కులకు అధికారుల సహ... కారం ఎంత మేరకు ఉందో ఇట్టే తెలిసిపోతుందని సామాన్యులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనాన్ని సైతం ఆపి జరిమానాలు విధించే పోలీసులు, ఆటోలను సైతం నిబంధనల పేరిట సీజ్ చేసే ఆర్టీఏ అధికారులు నంబర్ ప్లేట్లు లేకుండా సాగిస్తున్న ఈ దందాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నలు సామాన్యుడి మదిని తొలుస్తు న్నట్లు చెబుతున్నారు. ఈ దందాలను సాగిస్తున్న అక్రమార్కులు ప్రతీ నెలనెల పలు ప్రభుత్వ శాఖల్లోని కొంతమంది అధికారులకు ముడుపులను ముట్ట చెబుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే ఈ అక్రమ ఇసుక దందా మూడు ట్రాక్టర్లు ఆరు లారీలు అన్నట్లుగా సాగు తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ దందా కోసం ఒక్కటవుతున్న నాయకులు

ఖానాపూర్, కడెం ప్రాంతాలలో ఇసుక, మొరం లాంటి ప్రకృతి వనరులను కొల్లగొట్టేందుకు క్షేత్ర స్థాయిలో అధికార ప్రతిపక్ష నాయకుల మధ్య ఓ అవగాహన కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొరం దందా నీవు చేస్తే, ఇసుక దందా నేను చేస్తా అన్నట్లుగా ఒప్పందం జరిగినట్లు చెబుతున్నారు. ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ బీజేపీ నేత మొరం దందాకు పూనుకుంటే, నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు తాజాగా జిల్లాస్థాయిలో అధికార పార్టీ నేతల అండదండలున్నాయంటూ ఇసుక దందాను జోరుగా సాగిస్తున్నాడు. కడెం ప్రాంతంలోని అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమందిని కలుపుకొని గోదావరిలోని ఇసుక నిల్వలను ట్రాక్టర్ల ద్వారా డబ్బులు పోసి రాత్రి వేళల్లో నిర్మల్, భైంసా, బాసర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఈ అక్రమ దందాకు పవర్‌లో ఉన్న నాయకుల పేర్ల వినియోగం ?

సదరు అక్రమార్కులు సాగిస్తున్న మొరం, ఇసుక దందాలను అడ్డుకునేం దుకు అధికారులు సాహించకపోవడానికి ప్రధాన కారణం పవర్‌లో ఉన్న నాయకుల పేర్ల వినియోగ మే అంటూ ప్రచారం సాగుతోంది. కొంతమంది నాయకులు తమ అక్రమ దందాలను సాగించు కునేందుకు తాము పార్ల మెంటు పరిధిలోను పవర్‌లో ఉన్న ఓ నేతకు దగ్గరి మనుషులమంటూ ప్రచారం చేసుకుంటుండగా మరికొంత మంది తాము నియోజకవర్గ స్థాయిలో పవర్‌లో ఉన్న మరో నేతకు దగ్గరి మనుషుల మంటూ చెప్పుకుంటున్నట్లు సమాచారం. ఇలా ఈ అక్రమార్కులు చేసుకుం టున్న ప్రచారానికి తోడు సదరు నేతల పర్యటనలో వీరు చురుకుగా పాల్గొం టుండడంతో అధికారులు సైతం వీరిని అడ్డుకునే సాహసం చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇటువంటి ప్రచారాలు చేసుకుంటున్న అక్రమార్కుల వ్యవహారం ప్రజా ప్రతినిధులకు ఇప్పటి వరకు తెలవలేదా అంటూ పలు వురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమ దందాలకు అడ్డు కట్ట వేసి విలువైన ప్రకృతి సంపదను కాపాడి ఖానాపూర్, కడెం ప్రాంతా ల్లోని భావితరాలకు అందజేయాలని పలువురు కోరుతున్నారు.

నెంబర్‌ప్లేట్లు లేని మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నాం

రాహుల్ గైక్వాడ్, ఎస్సై, ఖానాపూర్



ఖానాపూర్ శివారులోని రెంకోని వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించగా నెంబర్‌ప్లేట్లు లేని ఒక ఎక్స్‌కవేటర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకున్నాము. నంబర్ ప్లేట్ లేని ఎక్స్‌కవేటర్ ద్వారా వాగులోంచి ఇసుకను తీస్తూ నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఈ మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల కోసం ఖానాపూర్ తహసీల్దార్‌కు సిఫార్సు చేశాం.

జస్టిస్ జువ్వాడి శ్రీదేవికి పలువురి పరామర్శ



సంతాపం తెలుపుతున్న పలువురు నేతలు

నిర్మల్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌కు చెందిన హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి తండ్రి సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా, బుధవారం ఆమెను పలువురు పరామర్శించారు. ధర్మపురి మండల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సూర్యారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నిర్మల్‌కు చెందిన సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డితో పాటు నాయకులు వెంకట్రామ్ రెడ్డి, తదితరులు బుధవారం తిమ్మాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి న్యాయమూర్తి శ్రీదేవితో పాటు ఆమె భర్త శ్రీహరిరావును పరామర్శించారు. సూర్యారావు చిత్రపటానికి అంజలి ఘటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

షిరిడీ పాదయాత్ర ప్రారంభం




పాదయాత్రలో భక్తులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దత్త జయంతి పురస్కరించుకొని నిర్మల్ పట్టణం గండి రామన్న సాయిబాబా ఆలయం నుండి షిర్డికి బుధవారం పాదయాత్ర ప్రారంభమైంది. 18 నుండి 20 రోజులుగా ఈ పాదయాత్ర కొనసాగి షిర్డి చేరనుంది. సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి ఈ పాదయాత్ర ప్రారంభించారు. పూదరి నరహరి, జిందం గోవర్ధన్, నారాయణరెడ్డి, ముత్యం, సంతోష్ గుప్తా, రేణుక దాస్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా

అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



భైంసా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం ప్రారంభమైన ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలు భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండువగా కొనసాగాయి. వేడుకలలో భాగంగా బుధవారం ఆలయ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు అయ్యప్ప ఆలయ శుద్ధి, పంచామృతాభిషేకం నిర్వహించారు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీ రుద్ర హోమం, మహా పూర్ణాహుతి, చేపట్టారు. అనంతరం దేవాలయ శిఖర కుంబాభిషేకం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజ కార్యక్రమాలు ముగిసిన పిదప అన్నప్రసాద వితరణ చేపట్టారు అయ్యప్పదీక్షదారులు, భక్తులు అధిక సంఖ్యలో వేడుకలలో పాల్గొని పూజ కార్యక్రమాలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భజన మండలిలు ఆలయ ప్రాంగణంలో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గర్భస్థ మహిళల మరణాలు తగ్గించాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్



న్యూ సాంగ్విలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అధికారులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలు తగ్గించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గర్భం దాల్చిన వెంటనే మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. హైరిస్క్ ఉన్న మహిళలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వైద్య చికిత్సలు అందించాలన్నారు. గర్భస్థ మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది సిబ్బందిని సమకూర్చాలని సూచించారు. సమన్వయంతో కృషి చేసి మరణాలు నియంత్రించాలన్నారు. హృద్రోగ నిర్ధారణకు 2డి ఎకో పరీక్షలకు అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలని ఆదేశించారు. వైద్యాధికారి రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, సురేష్, సౌమ్య, సరోజ, నయన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 17, 18న గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 8,124 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు సరిపడిన బస్సులు నడపాలన్నారు. కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు భద్రత ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, పర్యవేక్షణ అధికారి గంగారెడ్డి, వైద్యాధికారి రాజేందర్, కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్టీసీ డీఎం ప్రతిమా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మామడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మామడ మండలంలోని న్యూ సాంగ్వి గ్రామంలో ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సర్వే సమయంలో ప్రజలు తమ ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఏఎస్‌వో హరీష్, పంచాయతీ కార్యదర్శి అనసూయ ఉన్నారు.

ఆయుత చండీయాగంకు హాజరుకావాలని కలెక్టర్‌కు ఆహ్వానం

జిల్లాకేంద్రంలో రేపటి నుండి నిర్వహించ తలపెట్టిన శ్రీవైష్ణవ ఆయుత చండీ యాగానికి హాజరుకావాలని కోరుతూ బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు, ఎస్పీ జానకి షర్మిలలకు ఆహ్వానపత్రం నిర్వాహకులు అందజేశారు. సామల వేణుగోపాల్ రెడ్డి, చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గిడుగు పురస్కారానికి ఎంపికైన జిల్లా కవి

నిర్మల్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన కవి, ఉపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్ ప్రతిష్ఠాత్మక గిడుగు రామ్మూర్తి పంతులు అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 29న విజయవాడలో జరుగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని అందించనున్నారు. పలు సాహిత్య రచనలకు ఈ పురస్కారం ప్రకటించారు.

కొనుగోలు కేంద్రం ఉపయోగించుకోవాలి

నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామంలో బుధవారం సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి ప్రారంభించారు. మేడి పల్లి ధనలక్ష్మి గ్రామ సంఘం ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టారు. భీమ్‌రెడ్డి మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఏపీఎం బోసు, గ్రామా భివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్స్‌పై సీనియర్ సిటిజన్లకు అవగాహన

సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా బుధవారం సీనియర్ సిటిజన్లకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. చించోలిలో సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమాజంలో జరిగే మోసాలు వివరిం చారు. 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్‌పై తెలియ జేశారు. సైబర్ క్రైమ్ ద్వారా డబ్బులు కోల్పోయినట్లయితే 1930 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

భూగర్భ జలాలు సంరక్షించాలి

భూగర్భ జలాలు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఉపసంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం సోఫీనగర్ గురుకుల బాలికల పాఠశాలలో అవల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక.. కుటుంబం ఆత్మహత్యాయత్నం

• గోదావరి తీరంలో విషాదం • వడ్డీ వ్యాపారుల వేధింపులతోనే అని వెల్లడి • తండ్రి, కూతురు దుర్మరణం.. భార్యను రక్షించిన స్థానికులు • బాధితులు నిజామాబాద్ జిల్లా వాసులు



సంఘటన స్థలం వద్ద మృతదేహాల కోసం నది వద్ద వెతుకుతున్న పోలీసులు



నదిలోంచి రక్షించిన అనంతరం మృతుడి భార్య అనురాధ



వేణు మృతదేహం



కుమార్తె పూర్ణిమ (ఫైల్)

బాసర, నవంబర్, 6 : (ఆంధ్రజ్యోతి): బాసర గోదావరి నది తీరంలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వడ్డీ వ్యాపారుల బాధతో తల్లి, తండ్రులు కూతురితో సహా నదిలో దూకారు. వీరిలో ఇద్దరు మృతి చెందగా ఒకరి ప్రాణాలను స్థానికులు రక్షించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం న్యాల్‌కల్ రోడ్డులో నివాసం ఉండే ఉప్పలించి వేణు, ఆయన భార్య అనురాధ, కూతురు పూర్ణిమగా గుర్తించారు. వీరిలో ఉప్పలించి వేణు (50), పూర్ణిమ (24) నీటిలో మునిగి మృతి చెందగా వేణు భార్య అనురాధను చివరి క్షణంలో స్థానికులు రక్షించి ప్రాణాలు కాపాడారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన విషయం తెలియగానే ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ హుటా హుటిన ఘటనా స్థలానికి చేరు కున్నారు. బాధితురాలు షాక్‌లో ఉన్న అనురాధకు చికిత్స జరిపించారు.

రూ. 3 లక్షల అప్పుకు వడ్డీలు, చక్రవడ్డీలు వేసి గంజ్ మార్కెట్‌లో గల ఇద్దరు వ్యక్తులు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, గత్యంతరం లేక నే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు విలపిస్తూ అధికారులకు చెప్పింది. గల్లంతైన ఇద్దరి మృతదేహాల కోసం పోలీసులు దినమంతా గాలించారు. మృతుడు వేణు మృతదేహం లభించగా ఆయన కూతురు మృతదేహం ఆచూకీ దొరకలేదు. నది వద్ద బాధితులకు సంబంధించిన స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తరచూ ఘటనలు

బాసర వద్ద గోదావరి తీరం ఆత్మహత్య ఘటనలతో ప్రతిరోజు వార్తల్లోకెక్కుతుంది. భక్తుల పుణ్యస్నానాలు, పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం ఆవరించి ఉండే నదీ తీరం రోజుకొకటి విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

చాలా సందర్భాల్లో స్థానికులు గమ నించి రక్షిస్తున్నారు. లేదంటే ఘటనలు మూడు రేట్లు పెరిగేవి. వేణు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడానికి కంటే ముందే ఒకరిని స్థానిక జాలర్లు అడ్డుకొని రక్షించారు. ఇలా వారంలో ఒకటి, రెండు సంఘటనలు చోటుచేసుకోవడంపై స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.